సిరియల్



ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

వెంటనే హెలికాప్టర్ దిశ మారి వెనక్కి మళ్ళింది. సగం దూరం వచ్చిన తర్వాత అనంత్ సూచించిన దిశగా బయల్దేరింది.

పది నిమిషాలు గడిచేసరికి దూరంగా యేదో దీవి ఉన్నట్టుగా తోచింది.

కొంచెం ముందుకు వెళ్ళేసరికి భారత్ సంతోషంతో అరిచాడు. అతడు ఆ సముద్రతీరాన్ని—తీరం వెంబడే ఉన్న పొట్టి చెట్లను గుర్తించాడు. వాటి వెనుకనే కనపడుతున్న పొడుగాటి చెట్లు.

అనంత్ ప్రశ్నించాడు—

"అదేనా టకారా?"

"అవును."

సముద్రతీరాన్ని దాటి దీవిమీదకు వచ్చేసింది హెలి

కాప్టర్. బాగా ఎత్తుగా తీసుకెళ్ళమని చెప్పాడు భారత్ — పైలట్‌తో.

ఇంకా పైకి లేచింది.

అంతర్రిక్షం పడినిముషాల క్రితమే మేఘాల చాటునించి సూర్యుడు బయటకు వచ్చాడు.

ఇంకొంచెం ముందుకు వెళ్ళేసరికి వాళ్ళకు చెట్లపైగా ఎర్రటి దివ్యమైన తేజస్సు కనపడింది.

ఆ తేజస్సును చూస్తూనే ప్రొఫెసర్ అనంత్‌తో పాటు పైలట్ కూడా ఆశ్చర్యపోయాడు. భారత్ ఆశ్చర్యపడలేదు. ఆ అద్భుతమైన తేజస్సు యేమిటో అతడికి తెలుసు.

ఆ తేజస్సును చూస్తూనే అతడి శరీరం పులకించిపోయింది.

"ఏమిటా తేజస్సు?!" విస్మయంగా అడిగాడు అనంత్.

భారత్ ఆ తేజస్సు యేమిటో అనంత్‌కు చెప్పలేదు. మౌనం వహించాడు.

గూడెంమీదికి వచ్చేసింది హెలికాప్టర్.

కొంతమంది టకారాలు నడుస్తూ కనిపించారు పైనించి. తర్వాత కపాచీదేవత విగ్రహం, ఆ విగ్రహం మెళ్ళో వున్న హారంలోని కోట్ల రూపాయల విలువచేసే మణి కనిపించాయి.

కొంతమంది టకారాలు తలలు పైకెత్తి పైన యెక్కడో ఎగురుతున్న హెలికాప్టర్‌ని వింతగా చూశారు.

విగ్రహానికి మణి వున్నదనీ, దానినించే ఆ దివ్యమైన తేజస్సు వస్తోందనీ ప్రొఫెసర్ అనంత్‌కు తెలియదు. అసలు

అలాంటి అద్భుతమైన కాంతులను విరజిమ్మే మణి వుంటుందనే ఆలోచన అనంత్‌కు రాలేదు.

వెనక్కు మళ్ళించాడు హెలికాప్టర్ని—భారత్.

కింద కనపడుతున్న యిళ్ళను చూపిస్తూ వాటి గురించి అనంత్‌కు వివరించాడు భారత్.

"ఇంతకీ ఆ అద్భుతమైన ఎర్రటి కాంతి యేమిటి? ఆ విగ్రహం దగ్గర్నించి వస్తోంది?" అడిగాడు అనంత్—భారత్‌ని.

ఆ మణి గురించి యిక అతనితో చెప్పక తప్పదనుకున్నాడు భారత్.... అవును. అందుకు యిదే తగిన సమయం.

టకారా దీవిని గుర్తించిన హెలికాప్టర్ వెనక్కు తిరిగి వెళ్ళిపోయేటప్పుడు భారత్ కోట్ల రూపాయల విలువ చేసే ఆ మణి వెదజల్లుతున్నదే ఆ దివ్యమైన తేజస్సు అంటూ, అనంత్‌తో తన టకారాదీవి ప్రయాణంలోని అంతర్యాన్ని అతనికి చెప్పటం మొదలుపెట్టాడు.

* * *

ఎదురుచూసిన టకారాదీవి ప్రయాణం మొదలయ్యింది-పడవలో అంతా బయల్దేరారు.

హెలికాప్టర్‌లోనే వెళదామని అన్నాడు రంజిత్. కాని భారత్ అందుకు ఒప్పుకోలేదు. హెలికాప్టర్ దీవిలో దిగటాన్ని ఎవరైనా గమనిస్తే మన ప్రయాణం అంతా వృధా అవుతుందని అన్నాడు భారత్.

అతని ఆలోచన అందరికీ నిజమే అనిపించింది. ఐనా అక్కడికి టకారాదీవి మరీ యెక్కువ దూరంలో లేదు.

డోరం పెద్ద పడవను సిద్ధం చేసి దాన్ని నడపటానికి ఇద్దరు మనుషులను కూడా ఇచ్చాడు.

పడవ సముద్రంలో బయల్దేరింది.

భారత్ కు చెప్పలేనంత సంతోషంగా వుంది. తన ధ్యేయం యిప్పటికి నెరవేరబోతోంది. అనంత్ తో ఆ మణి గురించి, అందుకోసమే తను టకారా దీవికి ప్రయాణమవటం గురించి చెప్పగానే ఆశ్చర్యపోయాడు. తర్వాత ఆ మణి విలువ గురించి ఒక ఒప్పందం ఇద్దరిమధ్య కుదిరింది.

రంజిత్ మణి గురించి జాన్సన్ తో రహస్యంగా చెప్పాడు. అతనికి ఎంత డబ్బు ముట్టచెప్పేది కూడా చెప్పేశాడు భారత్ చెప్పినట్టుగా—

ఇప్పటికి ముహూర్తం కుదిరింది.

తను కన్న కలలన్నీ నిజమవబోతున్నాయి.

భారత్ కి గాల్లో తేలిపోతున్నట్టుగా వుంది.

వాలు గాలికి పడవ వేగంగా వెళుతోంది-సాబూజా దీవి మనుషులు తెడ్లు వేస్తూ దాన్ని నడుపుతున్నారు.

టకారా దీవికేసి దూసుకు వెళుతోంది పడవ. ఇప్పుడు పడవలో ప్రయాణిస్తున్న అందరికీ తెలుసు కోట్ల రూపాయల విలువచేసే ఆ మణి గురించి.

చూడనివాళ్ళు ఆ మణిని చూడాలని ఉత్సాహపడుతున్నారు. చూసినవాళ్ళు దాన్ని చేజిక్కించుకోవాలని పగటికలలు కంటున్నారు.

వీళ్ళందరి ఆలోచనలతో సంబంధం లేనట్టు నిశ్శబ్దంగా నీటిమీద జారిపోతోంది పడవ.

• • •

టకారాదీవిని పడవ చేరేసరికి సాయంత్రమయ్యింది. ఇంకొంచెం సేపట్లోనే చీకటి పడబోయేలా వుంది.

పడవను ఒడ్డుకులాగి యిసుకలో కొయ్యను పాతి

తాళ్లతో కట్టేశారు—సాబూజాతీవి మనుషులు.

వాళ్ళిద్దర్నీ అక్కడే వుండమని చెప్పి మిగిలినవాళ్ళు చెట్లలోకి వెళ్ళిపోయారు. జాన్సన్ చేతిలో ఆయుధాలు వున్న తోలుపెట్టె వుంది. అందులో కత్తులు—తుపాకులు వున్నాయి.

తెప్పలను తయారుచేసిన చోటుకు వచ్చారు అంతా. తాము తయారుచేసిన తెప్పలను వాళ్లందరికీ చూపించారు భారత్—సెల్లాలు.

ఒక్కసారిగా అమావాస్య రోజు రాత్రి మిగిలిన మనుషులంతా మాతమైపోవటం గుర్తొచ్చి బాధ కలిగింది.

వాళ్ళంతా చెట్ల దగ్గరకు వెళ్ళి ఒక చోట నిల్చుని తమ పథకం గురించి మాట్లాడుకుంటున్నారు.

భారత్ అందరికీ వివరించి చెబుతున్నాడు.

ఆ కపాలీదేవత విగ్రహం గురించీ ఎవరెవరు ఎక్కడ నిలుచోవలసిందీ చెబుతున్నాడు.

ఉన్నట్టుండి చెట్లచాటున యేదో అలికిడి వినిపించింది! అంతా గబుక్కున తలలు తిప్పి చూశారు.

అక్కడికి దగ్గరలోనే చెట్టుపక్కనే ఓ టకారాజాతి మనిషి బల్లెంతో నిలబడి వాళ్ళ చర్యలను గమనిస్తున్నాడు.

ఉలిక్కిపడ్డారు.

ముందుగా రంజిత్ తేరుకొని వాణ్ని పట్టుకోటానికి ముందుకు పరుగుతీశాడు. వెంటనే కాలికి యేదో తీగలాంటిది అడ్డుపడి ముందుకు పడ్డాడు.

కాని అప్పటికే జాన్సన్ రివ్వున ముందుకు పరు

గత్తాడు.

పరుగుదీశాడు టకారా మనిషి.

జాన్సన్ వదల్లేదు. అంతా ముందుకు పరుగుతీశారు.

“వాడ్ని వదలకు జాన్సన్ .... చంపు.... లేకపోతే మన ప్రయాస అంతా వృధా అవుతుంది” అరిచాడు భారత్.

ఆ మనిషి ఉన్నట్టుండి వెనక్కి తిరిగి చేతిలో వున్న బల్లేన్ని జాన్సన్ మీదకు విసిరాడు. జాన్సన్ పక్కకు తప్పుకున్నాడు తెలివిగా —

వెంటనే అతను జాన్సన్ మీదకు వచ్చాడు. జాన్సన్ యెగిరి యెదురుగా వస్తున్న వాడి గుండెలమీద తన్నాడు. వాడు కింద పడ్డాడు ఆ అదురుకు. పడటంతో బల్లెం దగ్గరగా పడిపోయాడు. దాన్ని అందుకోబోయాడు లేస్తూనే.

స్టెల్లా అతని ప్రయత్నాన్ని గ్రహిస్తూనే ఎగిరి అక్కడకు దూకి బల్లేన్ని అందుకొని పైకి లేవబోతున్న టకారాజాతి మనిషి గుండెల్లో బలంగా పొడిచింది.

దిగిపోయింది బల్లెం!

భయంకరంగా ఆర్తనాదం చేశాడు. చేస్తూనే వెనక్కి విరుచుకుపడిపోయాడు కట్టెలా.

బల్లేన్ని తీసి కసిగా ఒకటికి నాలుగుసార్లు వాడి శరీరమంతా పొడిచింది స్టెల్లా. టకారాజాతిమీద తనకు వున్న కసినంతా దొరికిన వాడిమీదనే చూపించింది,

వాడి శవాన్ని అక్కడే వదిలారు.

“ఒకసారి చీకటి పడకముందే కత్తుల చెట్ల మధ్యగా యేవైనా క్రూరజంతువులు వున్నాయేమో చూసివద్దాం” అన్నాడు భారత్.

సరేనన్నారు మిగిలినవాళ్ళంతా.

"నేను నడవలేను వెంటనే. కాలు నొప్పిగా వుంది. కొంచెంసేపు రెస్టు తీసుకోవాలి" అన్నాడు రంజిత్.

"నువ్వొక్కడివే యిక్కడ వుండగలవా?" అడిగాడు భారత్.

"ఉండలేను. అసలే కాలు నొప్పిగా వుంది. చిన్న జంతువు వచ్చినా ఈ నొప్పితో ఎదుర్కోలేను."

"ఐతే నీకు తోడుగా యెవరు వుంటారు?"

"ఎవరో ఒకరు"

"ఐతే స్టెల్లా—లీల వుంటారు."

"నేను వుండను. నేను కూడా మీతోనే వస్తాను" అన్నది లీల అనంత్‌తో.

"స్టెల్లా! మేము వెంటనే వచ్చేస్తాం! రంజిత్‌కు తోడుగా నువ్వుండు" అన్నాడు భారత్.

స్టెల్లా తల వూపింది.

తోలు పెట్టెలోనించి అంతా ఆయుధాలు తీసుకుని అక్కడినించి బయలుదేరారు.

రంజిత్‌కు ముందుగా కూర్చునివుంది స్టెల్లా.

ముందుగా వెళుతున్నవాళ్ళు చెట్ల మధ్యగా వున్న దారిలో నడిచి వెళుతున్నారు. వాళ్ళు కొంచెం దూరమైన తర్వాత అడిగాడు రంజిత్—

"స్టెల్లా నువ్వు భారత్‌తో మా దేశానికి యెందుకొచ్చావు?"

ఆశ్చర్యంగా అతడ్ని చూసింది.

తర్వాత ఇలా చెప్పింది:

"భారత్‌ను ప్రేమించాను. అతడి ప్రేమ కోసం ఈ దేశానికి వచ్చాను."

నవ్వేడతను—"నేను నమ్మను! అతను కోటీశ్వరుడని

అతని ఆ స్త్రీని ప్రేమించి వచ్చావు కదూ!"

ఉలిక్కిపడి అంతలోనే "ఫూల్‌లా మాట్లాడకు రంజిత్. నేను మంచిదాన్ని కాదు" అన్నది.

రంజిత్ కూడా నవ్వాడు.

"సరే....నువ్వెలాంటిదానివైనా నా మనసులో ఇన్ని రోజులుగా వున్న మాటను చెబుతాను. మొదటి చూపులోనే నన్నాకర్షించావు. నిన్ను నేను ప్రేమించాను. నువ్వు ఒప్పుకుంటే భారత్‌తోపాటుగా మిగిలినవాళ్ళని కూడా చంపి కోట్లు ఖరీదుచేసే మణితో...."

అతడి మాటలు పూర్తికాకముందే సైలా ప్రళయకాళిలా యెగిరి అతడి మొహం మీద శక్తి కొద్దీ తన్నింది.

రంజిత్ వెనక్కి పడ్డాడు. పడుతూనే జేబులోనించి రివాల్వర్ బయటకు తియ్యబోయాడు. కాని అతడి చర్యను గమనిస్తూనే రెండు గుండెల మధ్య పట్టలో దాచుకున్న రివాల్వర్‌ను బయటకు లాగి అతను వూహించనంత వేగంగా రెండుసార్లు అతనికేసి కాల్చింది.

"ధాం.... ధాం!"

నెత్తురు మడుగులో పడిపోయాడు రంజిత్.

* * *

కత్తుల చెట్లమధ్య నడుస్తున్న ఎళ్ళంతా వెనక్కి మళ్ళారు—ఉలిక్కిపడుతూ.

"ఏదో జంతువో లేక టకారాజాతి మనిషో ఎటాక్ చేసివుంటాడు. అందుకే యిద్దరో యెవరో రివాల్వర్ పేల్చారు. పదండి వెనక్కి...." అన్నాడు భారత్ కంగారుగా.

గబగబా నడిచి అక్కడకు వచ్చిన వాళ్ళందరికీ

రివాల్వర్ పట్టుకొని యెర్రబడిన కళ్ళతో నిల్చున్న స్టెల్లా, నెత్తురు మడుగులో పడివున్న రంజిత్ కనిపించారు.

ఆ దృశ్యం చూడటంతోనే అంతా కొయ్యబారి పోయారు.

భారత్‌ను చూడటంతోనే ఒక్కసారి విసురుగా పరిగెత్తుకువచ్చి అతని గుండెలమీద పడిపోయింది స్టెల్లా.

"ఏం జరిగింది స్టెల్లా?"

ఆమె కళ్ళలో మొదటిసారిగా భారత్ కన్నీళ్ళను చూశాడు.

ఆమె జరిగిందంతా చెప్పేసింది

అంతా విని భారత్ బాధపడలేదు. టకారాదీవిలో తిరిగే నీలిరంగు పాము కంటే—నికోలాయ్ దీవుల్లో తిరిగే యెర్ర తోడేలు కంటే ప్రమాదకరమైన అలాంటి నీచుడు చనిపోయినందుకు భారత్ కొంచెంకూడా విచార పడలేదు.

అప్పటికప్పుడే సముద్రతీరంలో గోతిని తవ్వి అందులో రంజిత్ శవాన్ని పూడ్చిపెట్టారు.

అప్పటికి చీకటిపడిపోయింది.

* * *

గూడెంలో సందడి సద్దుమణిగిన తర్వాత—టకారా జాతి మనుషులంతా తలుపులు బిగించుకుని ఇళ్ళలో పడుకుని నిద్రపోతూ వుంటారని నిర్ధారణ చేసుకున్న తర్వాత వాళ్ళంతా చీకట్లో జాగ్రత్తగా దయ్యాల్లా నడుస్తూ కపాలీదేవత విగ్రహం దగ్గరకు చేరుకున్నారు.

చెట్ల మధ్యనించి నడుస్తున్నప్పుడే వాళ్ళకు ఆ మణి యెర్రని కాంతులు కనిపించాయి. వాళ్ళు ఆశ్చర్యంతో

చూశారు.

విగ్రహం ముందు ఇళ్ళ ఎదురుగా వున్న గుంజలకు కాగడాలు వెలుగుతున్నాయి.

అంతా నిశ్శబ్దంగా వుంది!

ఆ విగ్రహాన్ని చూడటంతోనే భయంతో లీల కెవ్వున అరవబోయింది. ఆమె ప్రయత్నాన్ని గ్రహించిన ప్రొఫెసర్ అనంత్ అరిచేత్తో ఆమె నోరును మూసేశాడు.

బయల్దేరే ముందు భారత్ అందరికీ హెచ్చరికలు చెయ్యనే చేశాడు—యెటువంటి పరిస్థితిలోనూ అరవకూడదని.

కాగడాల వెలుగులో వింత కాంతులను ప్రసరిస్తున్న మణిని వాళ్ళు చూశారు!

అటూ యిటూ చూసి మిగిలినవాళ్ళకు సైగ చేసి భారత్ దేవత విగ్రహం ముందున్న మెట్టుమీద కాలు వేశాడు. జాన్సన్ అతడిని అనుసరించాడు.

ఒక మెట్టు యెక్కీ—సరికే హాఠాత్తుగా వెగటు వాసన అందరి ముక్కు—పుటాలనూ తాకింది. ఆ వాసన గురించి తెలిసిన సెల్లా భారత్ అదిరిపడ్డారు. నీలిరంగు పాము కాలిని చుట్టుకున్నంతగా వణికిపోయారు.

భారత్ వెనక్కు—తిరిగాడు.

అప్పటికే దేవత విగ్రహానికి పక్క—గా వున్న ఇళ్ళ వెనుకనించి టకారాలు బల్లేలు, వంకీ కత్తులతో వికృతంగా నవ్వుతూ బయటకొచ్చారు!

షాక్.... షాక్.... షాక్.

కెవ్వున అరిచింది లీల షాక్‌తో!

టకారాలలో నాయకుడూ వున్నాడు. నాయకుడి

పక్కనే ఆంద్రూస్ కూడా వున్నాడు నవ్వుతూ—అతడి చేతిలో వంకీకత్తి వున్నది!

సెల్లా షాక్ నించి తేరుకోక ముందే "ఈ రోజు ఉదయం ఈ దీవిపైన హెలికాప్టర్ తిరిగినప్పుడే ఈ రాత్రికి మీరు యిక్కడికి మణికోసం తిరిగివస్తారని ఊహించాను. అందుకే మేమంతా యిక్కడ దాక్కుని మీ కోసం యెదురుచూస్తున్నాం! పోయినసారి ఎలాగో మీరిద్దరూ ప్రాణాలతో తప్పించుకుని వెళ్ళగలిగారు. కాని కోట్లు విలువచేసే ఈ మణికోసం వ్యామోహంలో తిరిగివచ్చారు. ఆ వ్యామోహమే యిప్పుడు మీ ప్రాణాలను బలిగొనబోతోంది. ఈసారి ఒక్కరు కూడా ప్రాణాలతో ఈ దీవినించి తప్పించుకోలేరు" అన్నాడు ఆంద్రూస్ నవ్వుతూనే.

అతడి మాటలు పూర్తి అవకముందే "పారిపొండి" అని అరిచాడు భారత్ పూహించనంత వేగంగా కపాలీ దేవత విగ్రహం వెనక్కి పరుగుదీస్తూ.

అంతే.

జాన్సన్—సెల్లా తుపాకులు పేలుస్తూనే అక్కడినించి చెట్లవైపు పరుగుతీశారు!

ఒక తుపాకిగుండు టకారాజాతి మనిషి గుండెల్లో దిగబడి వాడు పెద్దగా అరుస్తూ కూలిపోయాడు.

నాయకుడు బిగ్గరగా అరిచాడు కిచకిచల భాషలో!

ఆంద్రూస్ వంకీకత్తి సాయంతో నడుస్తూ గబ గబా దేవత విగ్రహం వెనకవైపు వచ్చాడు. ఆంద్రూస్ అక్కడికి వస్తాడని పూహించకపోయినా చీకటిగా వుందని, టకారాలు యింకో దిక్కుకు వెళ్ళగానే పారిపోవచ్చుననీ అక్కడ దాక్కుని వున్నాడు భారత్ రివా

ల్వర్ పట్టుకుని.

ఆటు వైపుగా వచ్చిన ఆంద్రూస్‌ను విగ్రహం చాటుకు లాగుతూనే ఒక చేత్తో అరవకుండా నోరు మూశాడు! గింజుకున్నాడు ఆంద్రూస్ భయంతో!!

"ఆంద్రూస్ ...! నువ్వో జిత్తులమారి నక్కవి. శాడిస్టువి! అసలు నీవల్లనే ఇదంతా జరిగింది! అమావాస్య రోజు రాత్రి మా పథకాన్ని నువ్వు చెడగొట్టకుండా వున్నట్లయితే ఈ మణితో అందరం సురక్షితంగా ఈ దీవి వదిలి వెళ్ళిపోయేవాళ్ళం ... కాని నాగరికుడివై వుండి ఈ అనాగరికులతో చేతులు కలిపి మా వాళ్ళందర్నీ వూచకోత కోయించావు. అందుకు ఫలితం అనుభవించు. నీ లాంటి గుంటనక్కలు బతికి వుండకూడదు" అంటూ ప్యాంటు జేబులోనించి కత్తి తీసి బలంగా అతడి గుండెల్లో ఒక్క పోటు పొడిచాడు.

మూలిగాడు ఆంద్రూస్.

ఒక్క పోటుకే ఆంద్రూస్ ప్రాణం గాల్లో కలిసి పోయింది.

వదిలేశాడు ఆంద్రూస్‌ను.

ఇళ్ళ వెనుకవైపుకు వచ్చాడు.

కొంతమంది టకారాలు—నాయకుడు విగ్రహం ఎదురుగా నిలబడి వున్నారు.

చప్పుడు చెయ్యకుండా చీకట్లోకి పరుగుతీశాడు భారత్. అతడి చేతిలో రివాల్వర్ వుంది.

మరోవైపు—

మిగిలినవాళ్ళందరినీ టకారాలు వెంట తరమగానే పరుగుదీశారు వాళ్ళు ప్రాణభయంతో!

టకారాలు బల్లేలు విసురుతున్నారు!

లీల పరుగెత్తలేకపోయింది!

వెనుకపడింది. ఆమెకోసం ఒక్క నిముషం ఆగాడు ప్రొఫెసర్ అనంత్. అంతే. టకారా విసిరిన బల్లెం రివ్వునవచ్చి అతడి డొక్కలో దిగిపోయింది!

భయంకరంగా అరుస్తూ కూలిపోయాడు అనంత్. అప్పుడే అంతా అక్కడకు వచ్చేశారు టకారాలు. పిచ్చి పట్టినదానిలా అరిచింది లీల. ఆమె అరుపు పూర్తి అవకుండానే ఓ వంకీ కత్తి ఆమె తలను నరకేసింది! లీల తల వెళ్ళి దూరంగా పడిపోయింది.

ముందు పరిగెత్తుతున్న జాన్సన్ — స్టెల్లాలకు ఆ ఇద్దరి అరుపులూ వినిపించాయి. వాళ్ళు యేమైవుంటారో వూహించుకున్నారు. స్టెల్లా భారత్ గురించి ఆలోచిస్తోంది.

చీకట్లో దారి సరిగా తెలీటంలేదు.

పరిగెత్తుతున్న వాడల్లా జాన్సన్ చీకట్లో ఓ చెట్టును ఢీకొని కింద పడిపోయాడు! అతడికోసం ఆగదల్చుకోలేదు స్టెల్లా. ముందుకు పరుగుదీసింది.

జాన్సన్ లేవబోయాడు!

అప్పటికే టకారాజాతి మనుషులు అతడిని చుట్టుముట్టారు. చెట్టును ఢీకొనటంతో జాన్సన్ చేతిలోని తుపాకీ ఎగిరి ఎక్కడో పడిపోయింది!

ఒకడు జాన్సన్ చేతులు వెనక్కు విరిచి పట్టుకున్నాడు. రెండోవాడు బల్లెన్ని వెనక్కల్లా పోనిచ్చి విసురుగా తీసుకొచ్చి జాన్సన్ పొట్టలో దించేశాడు. హృదయవిదారకంగా అరిచాడు జాన్సన్.

ఆ అరుపు స్టెల్లాకు వినపడింది.

వెనుకనే వస్తున్న భారత్ కు కూడా వినపడింది.

ఎండుటాకులమీద పరిగెత్తుతున్న స్టెల్లా ఆయాసంతో ఓ చెట్టును ఢీకొనబోయి ఆగిపోయి నిల్చుంది ఆ చెట్టును పట్టుకుని.

ఒకే ఒక్క నిముషం.

ఆ ఒక్క నిముషంలోనే ఆమె పాదం మీద చురుక్కుమంది. ఒక్కసారికాదు వెంటవెంటనే నాలుగు సార్లు.

ఆ తర్వాత ఎండుటాకులమీద కొరడాతో కొడుతున్న చప్పుడు వినిపించింది.

స్టెల్లా బిగుసుకుపోయింది. తన కాలిమీద నాలుగు సార్లు నీలిరంగు పాము కాటు వేసిందని తెలుసుకుంది. వెంటనే ఆమె పాదంమీదనించి నీలిరంగు పాము జరజరా పాకుతూ వెళ్ళటాన్ని ఆమె గ్రహించింది.

భయంతో బిగుసుకుపోయింది.

వెనకనించి టకారా మనుషులు పరిగెత్తుకు వస్తున్న చప్పుడు వినిపించింది! వాళ్ళకు దొరక్కూడదనుకుంటూ అక్కడినించి కదిలింది స్టెల్లా. కాని ఆమెకు అడుగులు ముందుకు పడలేదు. కళ్ళు తిరిగాయి! శరీరమంతా అదోలా అయిపోయింది. స్పృహ తప్పుతున్నట్టుగా అనిపించింది!

ఆమె తూలుతూ కింద పడబోతున్నప్పుడే ఓ బల్లెం రివ్వున వచ్చి ఆమె వెన్నులో దిగబడిపోయింది!

అంతే! స్టెల్లా అరవకుండానే కూలిపోయింది. ఎంతో ధైర్యసాహసాలు కలిగిన స్టెల్లా చివరకు ఆ దీవికి బలి అవక తప్పలేదు!

టకారాలు దగ్గరికొచ్చారు.

ఆమెను గుర్తించి కసితో ఆమె తలను నరికేశారు. భారత్ కోసం ముందుకు వెళ్ళారు.

వాళ్ళు వెళ్ళిన రెండు నిమిషాలకు భారత్ అక్కడికి వచ్చాడు. దార్లో పడివున్న శరీరం కాలికి తగిలి ఆమె మీద పడిపోయాడు. అలా పడినప్పుడే అతని ముఖం మీద రెండుసార్లు చురుక్కుమని యెవరో సూదితో పొడిచినట్లనిపించింది. ఆ తర్వాత యెండుటాకులమీద కొరడాతో కొడుతున్నట్లుగా అనిపించింది. జేబులో నించి టార్చ్ తీసి వెలిగించి చూశాడు.

నీలిరంగు పాము జరజర వెళ్ళిపోతోంది.

కొయ్యబారిపోయాడు భారత్.

ఎదురుగా—

తల తెగిపోయిన సెల్లా....

"సెల్లా" బిగ్గరగా అరిచాడు భారత్.

ఆ అరుపుముందు ముందు వెళుతున్న టకారాజాతి మనుషులకు వినపడింది. వాళ్ళు రివ్వున వెనక్కి తిరిగారు.

ఏడుస్తున్నాడు భారత్-సెల్లా శరీరంమీదపడి.

"సెల్లా నన్ను క్షమించు. నువ్వు వద్దని ఎంతగా చెప్పినా కోట్ల విలువచేసే మణికోసం మళ్ళీ ఈ దీవికి తీసుకువచ్చాను. ఆంద్రూస్ చెప్పిన మాటలు నిజం. ఆ వ్యామోహమే మనందరినీ ఇలా దహించివేసింది. అంతే కాదు సెల్లా ప్రమాదంలో ఇరుక్కున్నప్పుడల్లా కరోన్ శాపం వెంటాడుతుందనుకున్నాను. ఆ ప్రమాదం నించి బయటపడగానే కరోన్ మనల్ని క్షమించిందనుకున్నాను. కాని కరోన్ మనల్ని క్షమించలేదు సెల్లా... కరోన్ శాపమే మనకీ శిక్షను విధించింది."

టకారాలు దగ్గరకు వస్తున్నారు.

ఐనా భారత్ అక్కడినించి పారిపోయే ప్రయత్నం చెయ్యలేదు. ఇంతమంది చావుకు కారకుడైన తను తప్ప

ఉండా చావాలి....

అతడికి కళ్ళు తిరుగుతున్నాయి. నీలిరంగు పాము విషం శరీరంలోకి ఎక్కుతోంది....

కళ్ళు మూతలుపడుతున్నాయి....

'క్షణోక్ ....నన్ను క్షమించు—' సరిగ్గా అప్పుడే టకారాజాతి మనిషి చేతిలోని వంకీ కత్తి భారత్ తలను నరికేసింది. తల ఎగిరి దూరంగా ఎక్కడో పడింది.

టకారాలు తృప్తిగా గంతులు వేశాడు.

కాగడాల వెలుగులో టకారాలను కాపాడే కపాలీ దేవత హారంలో వున్న మణి దివ్యమైన కాంతులను విరజిమ్ముతోంది.

— : సమాప్తం : —